ప్రజాశక్తి
బుధవారం 21, జూన్ 2023
5
అనంతపురం



మనగ్రోమోర్ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని రాయలచెరువులో ఉన్న మన గ్రోమోర్ సెంటర్‌ను వ్యవసాయ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఏప్రిల్ నెలలో కేశవరాయుని పేట గ్రామానికి చెందిన రైతులు కొందరు పత్తి విత్తనాలు కొనుగోలు చేసి విత్తారు. సుమారు 45 రోజులు దాటినా పత్తి అనుకున్న స్థాయిలో పెరగకపోవడంతో నిరాశ చెందిన రైతన్నలు స్పందనలో కలెక్టర్, మండల వ్యవసాయ అధికారులకు విన్నవించారు. దీంతో స్పందించిన వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే రైతన్నల పత్తి పొలాలను పరిశీలించారు. అనంతరం గ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేసి వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి ఎడి వెంకటరాముడు, మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న పరిశోధనాత్మక జర్నలిజం



సెమినార్‌లో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి గోపాలగౌడ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పోర్తు ఎస్టేట్‌గా చెప్పుకునే మీడియాలోనూ పరిశోధనాత్మకత కథనాలు కన్పించకుండా పోయిన పరిస్థితి ఏర్పడిందని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ గోపాలగౌడ అన్నారు. మోటూరు హనుమంతరావు ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం పుట్టపర్తి పట్టణంలోని జానకిరామయ్య కళ్యాణమంటపంలో మంగళవారం జరిగింది. ప్రజాశక్తి ఎడిటర్ తులసిదాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమ ప్రారంభంలో 'రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు-మీడియా పాత్ర' అనే అంశంపై సుప్రీంకోర్టు జడ్జి గోపాలగౌడ ప్రసంగించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా నాడు ఏర్పచుకున్న లక్ష్యాలు చేరుకోవడంలో ఇంకా సుదూరంగానే ఉన్నామని పేర్కొన్నారు. ఇప్పటికీ రాజ్యాంగ ముందు అనేక సవాళ్లు ఉన్నాయన్నారు. మోటూరు హనుమంతరావు లాంటి నాయకులు నేటి తరానికే కాకుండా తనలాంటి వారికి కూడా మార్గదర్శకులని అన్నారు. ఆయన మార్గదర్శకంలోనే ఎస్ఎఫ్ఐ వ్యవస్థాపకుల్లో తాము ఒకరిగా ఉన్నామని గుర్తుకు తెచ్చుకున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో రూపొందించిన భారత రాజ్యాంగంలో అందరికీ సమానత్వం, సమాన హక్కులు, సమాన అవకాశాలు అన్నది పేర్కొన్నారని అయితే ఇప్పటికీ ఆ లక్ష్యాలు ఏ మేరకు నెరవేరాయన్నది పరిశీలిస్తే చాలా సుదూరంగా ఉన్నామన్నది స్పష్టమవుతోందని అన్నారు. జనాభాలో సగభాగమున్న స్త్రీలకు ఇప్పటికీ సమానత్వం సాధించలేకపోయామని చెప్పారు. చట్టసభల్లో ఇప్పటికీ 25 శాతం సీట్లు ఇవ్వలేకపోతున్నామన్నారు. ఇందులో న్యాయవ్యవస్థ మినహాయింపు కాదని చెప్పారు. ఎంతోమంది న్యాయవాదులుగా ఉన్నప్పటికీ ఇప్పటికీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ముగ్గురే అయ్యారని పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక సమానత్వమూ ఇంకా అందలేదని విచారం వ్యక్తం చేశారు. పోర్తు ఎస్టేట్‌గా చెప్పుకునే మీడియాలోనూ పరిశోధనాత్మకత చచ్చిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దఎత్తున కార్పొరేట్ ప్రకటనలపై ఆధారపడిన మీడియా అందుకు అనుగుణంగానే వార్తలిస్తోందే తప్ప ప్రజా సమస్యలపై పరిశోధనాత్మకత కథనాలిచ్చే పరిస్థితి లేదని చెప్పారు. దేశంలో 2014 నుంచి 2020 మధ్య మీడియాకు వచ్చిన ప్రకటన విలువ రూ.6500 కోట్లు అని గుర్తు చేశారు. ఇంత పెద్దఎత్తున ప్రకటనలు పొందుతున్న మీడియా వ్యతిరేక కథనాలివ్వగలదా అని ప్రశ్నించారు. అయితే స్వతంత్ర జర్నలిస్టులు కొందరు అక్కడక్కడా ప్రజా సమస్యలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అటువంటి జర్నలిస్టులపైనా దాడులు తప్పడం లేదని చెప్పారు. 40 మంది జర్నలిస్టులపై దాడులు జరిగాయని గుర్తు చేశారు. మరోవైపు దేశంలో మత విద్వేషాలు పెరుగుతున్నాయన్నారు. మెజార్టీ, మైనార్టీ అన్న తేడా ఏదీ రాజ్యాంగ పరిధిలో లేదని చెప్పారు. అయితే ఆ పేరుతో ఇప్పుడు దేశంలో రాజకీయం నడుస్తోందన్నారు. ఇటువంటి రాజకీయాలకు స్వస్థి పలికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సి అవసరముందని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టుల కృషి ఎంతగానో ఉందని చెప్పారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేశారని గుర్తు చేశారు. అటువంటి జర్నలిస్టులకు ఇటువంటి ప్రోత్సహకాలు అందించే కార్యక్రమాన్ని ప్రజాశక్తి నిర్వహించడం అభినందనీయమన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి తరం యువత సమాజం గురించి ఆలోచించడం మానేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. వామపక్ష భావజాలమున్న యువత నేడు ఎంతో అవసరమన్నారు. మీడియా నిష్పక్షపాతంగా ప్రజాసమస్యలను వెలికితీయాలని పిలుపునిచ్చారు.

ఎంహెచ్ స్మారకోపన్యాసంలో సుప్రీం కోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ గోపాల గౌడ



మోటూరు హనుమంతరావు, బొమ్మారెడ్డి చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

అవార్డులు ప్రదానం

మోటూరు హనుమంతరావు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం పుట్టపర్తిలో మంగళవారం ఉదయం జరిగింది. మోటూరు హనుమంతరావు అవార్డును నవభూమి బ్యూరో తుమ్మలపల్లి ప్రసాద్‌కు అందజేశారు. జ్ఞాపికతోపాటు శాలువా కప్పి సత్కరించారు. ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసే విలేకరులకు ఇచ్చే అంతర్గత అవార్డుల ప్రదానోత్సవంలో స్టేట్ బ్యూరో పవన్‌కుమార్, స్టాఫ్ రిపోర్టర్ల విభాగంలో శ్రీనివాసాచారి, మండల విలేకరుల విభాగంలో హిందూపురం విలేకరి షబ్బీర్, ప్రకాశం జిల్లా సింగరాయకొండ విలేకరి రవికుమార్‌కు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజరు అచ్యుతరావు, అవార్డు ఎంపిక కమిటీ ఛైర్మన్ తెలకపల్లి రవి, సభ్యురాలు ప్రొఫెసరు అనిత , ప్రజాశక్తి మేనేజరు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మోటూరు హనుమంతరావు స్మారక అవార్డును అందుకుంటున్న నవభూమి బ్యూరో తుమ్మలపల్లి ప్రసాద్



అవార్డును అందుకుంటున్న ప్రజాశక్తి స్టేట్‌బ్యూరో పవన్‌కుమార్



అవార్డును అందుకుంటున్న ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాసాచారి



అవార్డును అందుకుంటున్న ప్రజాశక్తి సింగరాయకొండ విలేకరి రవికుమార్



అవార్డును అందుకుంటున్న ప్రజాశక్తి హిందూపురం విలేకరి షబ్బీర్

స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ విధానాలను రద్దు చేయాలి

సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ



50 వ డివిజన్‌లో పర్యటిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారం మోపేలా తీసుకొచ్చిన స్మార్ట్ మీటర్లు, ట్రూ ఆఫ్ చార్జీల విధింపు వంటి విధానాలను రద్దు చేయాలని సిపిఎం నగర 1వ కమిటి కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం నగర 1వ కమిటి ఆధ్వర్యంలో విద్యుత్ భారాలు ప్రజల ఇబ్బందులు తెలియజేస్తూ రూపొందించిన కరపత్రాలను 50వ డివిజన్‌లోని పలు కాలనీల్లో ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర 1వ కమిటి కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ భారాలు మోయలేక చిన్న పరిశ్రమలు మూత పడుతున్నాయని అన్నారు. చేతివృత్తిదారులు, ప్రజలు భారాలు మోయలేక ఆందోళన పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న బారాలకు వ్యతిరేకంగా సిపిఎం పోరాటాలు చేస్తోందన్నారు. ప్రజలు పాల్గొని ఉద్యమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ నాయకులు వలీ, మసూద్, ప్రకాష్, గఫూర్, ఎన్టీఆర్ శీనా, సురేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ రెడ్డి, 50వ డివిజన్ శాఖ కార్యదర్శి ఫకృ, 49వ డివిజన్ శాఖ కార్యదర్శి ఫరీదా, నాగయ్య, దాదూ, వన్నూరప్ప, నాగరాజు, బాషా తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం : విప్ కాపు

ప్రజాశక్తి-డి.హీరేహాల్

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు మంగళవారం మండలంలోని మల్లికేతి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ముఖ్యంగా కులమతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం చేరుతోందన్నారు. రాబోవు కాలంలోనూ ప్రతి ఒక్కరూ వైసిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పార్వతి మల్లికార్జున, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బోయ మల్లికార్జున, హనుమంతురెడ్డి, ఎంపిటిసి అంగడి రంగమ్మ, గోవిందు, మండల కన్వీనర్ వన్నూరుస్వామి, సచివాలయ కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, నాయకులు పులకుర్తి చంద్ర నాగ, తొండే వెంకటేష్, కాశ్మీరా, మంజునాథ, తదితరులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి


క్యాడర్ స్ట్రెంత్‌ను అప్‌డేట్ చేసి

సకాలంలో వేతనాలు అందించాలి

డిఇఒ సాయిరాంకు యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బదిలీలు- 2023లో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని క్యాడర్ స్ట్రెంత్‌ను అప్‌డేట్ చేసి సకాలంలో జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లింగమయ్య, గోవిందరాజులు డిమాండ్ చేశారు. మంగళవారం డిఇఒ సాయిరాంను యుటిఎఫ్ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలు-2023 వల్ల ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల క్యాడర్ స్ట్రెంత్‌లో మార్పులు జరగడం అందరికీ తెలిసిందే అన్నారు. బదిలీల్లో కొత్త పాఠశాలలో జాయిన్ అయిన వారికి క్యాడర్‌ల వారీగా (ఎస్‌జిటి, ఎస్ఎ, హెచ్‌ఎం) జాయినింగ్ తేదీ ఒకేవిధంగా ఉండేలా మండల విద్యా శాఖ అధికారి, ప్రధానోపాధ్యాయులు ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బదిలీలు-2023 వల్ల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో క్యాడర్ స్ట్రెంత్‌లో మార్పులు వచ్చాయని తెలిపారు. వెంటనే క్యాడర్ స్ట్రెంత్‌లను అప్‌డేట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగా ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలకు గ్రేడ్-2 హెచ్‌ఎంలను ఇచ్చారని తెలిపారు. ఈ పాఠశాలలకు వెంటనే డిడిఓ కోడ్‌లను కేటాయించి సకాలంలో వేతనాలు అందేలా చూడాలన్నారు. 98 మంది కంటే విద్యార్థులున్న ఉన్నత పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలలుగా మార్పు చేశారన్నారు. ఇలాంటి ప్రాథమికోన్నత పాఠశాలల్లో సీనియర్ పాఠశాల సహాయకుల ద్వారా జీతాలు చేసుకునేలా వెసులుబాటు కల్పించాలని కోరారు. స్పందించి క్యాడర్ స్ట్రెంత్‌లోని సమస్యలను వెంటనే పరిష్కరించి ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్ర, ఆడిట్ కమిటి కన్వీనర్ సుబ్బరాయుడు, శివరుద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



డిఇఒకు వినతిపత్రం సమర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

'నాడు- నేడు' పనులను వేగవంతం చేయాలి

కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-కుందుర్పి

నాడు-నేడు కింద పాఠశాలల్లో చేపట్టిన భవనాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల భవనాలు పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి భోజన ఏజెన్సీ నిర్వాహకులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత బీసీ గురుకుల పాఠశాలను తనిఖీ చేసి పాఠశాలలో పురోగతిపై ఆరాతీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల రూపురేఖలు మార్చేందుకే ప్రభుత్వం నాడు-నేడు పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఇందులో భాగంగా రూ.కోట్ల నిధులు మంజూరు చేసి భవనాల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. తర్వాత అపిలేపల్లిలు ఉపాధి కూలీలు పలు సమస్యలపై ఏకరువు పెట్టారు. ముఖ్యంగా పనిముట్లు ఇవ్వడం లేదని, మండుటెండలో అసౌకర్యాలు నడుమ ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాకుండా నెలల తరబడి పనులు చేసినా, బిల్లుల అందక నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్‌డిఒ, జిల్లా విద్యాశాఖ అధికారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అనుమానంతోనే పెట్రోల్ పోసి నిప్పంటించాడు..

తాడిపత్రి ఘటనలో నిందితుడి అరెస్టు : డీఎస్పీ గంగయ్య

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తన భార్య వరసకు బావ అయ్యే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని అనుమానించి తాడిపత్రిలో భార్యాభర్తలపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు డీఎస్పీ సిఎం గంగయ్య తెలిపారు. మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ రూరల్ పరిధిలోని చుక్కలూరు పారిశ్రామికవాడలో ఉన్న ఓ నల్లబండల ఫ్యాక్టరీలో నల్లపరెడ్డి, భార్య కష్ణవేణి నల్లబండల పాలీస్ పని చేసుకుంటూ నివాసం ఉండేవారు. ఈనేపథ్యంలో హైదరాబాదులో ఉన్న మల్లు రామేశ్వర్‌రెడ్డి అలియాస్ రమేష్‌రెడ్డి, అతని భార్య సునీతను అక్క వరుస అయ్యే కృష్ణవేణి రెండేళ్ల క్రితం వీరి వద్దకే తీసుకొచ్చి ఫ్యాక్టరీలో నివాసం ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే రమేష్‌రెడ్డి భార్యతో నల్లపురెడ్డి చనువుగా ఉండేవాడు. అనుమానం ఎక్కువ కావడంతో ఈనెల 17న తాగి వచ్చిన రమేష్‌రెడ్డి భార్య సునీతతో గొడవ పడ్డాడు. దీంతో నల్లపురెడ్డి, కృష్ణవేణి మందలించడంతోపాటు ఇష్టానుసారంగా మాట్లాడి చెప్పుతో కొట్టాడు. ఆగ్రహించిన రమేష్‌రెడ్డి రాత్రి 11:15 సమయంలో తాగి వచ్చి బాటిల్లో తీసుకొచ్చిన పెట్రోల్‌ను నిద్రిస్తున్న నల్లపురెడ్డి దంపతులపై పోసి నిప్పంటించి పారిపోయాడు. దీంతో నల్లపురెడ్డి, భార్య కృష్ణవేణితోపాటు కూతురు పూజిత గాయాలపాలైన విషయం తెలిసిందే. గాయపడిన నల్లపురెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో బుగ్గ సమీపంలోని కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్ద ఉన్న రమేష్‌రెడ్డిని తాడిపత్రి రూరల్ సీఐ చిన్న పెద్దయ్య, ఎస్సై గౌస్ మహమ్మద్, సిబ్బందితో కలిసి నిందితుని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న తాడిపత్రి డీఎస్పీ గంగయ్య

2022 పంటలబీమా చెల్లించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు



ఎపిఒకు వినతిపత్రం సమర్పిస్తున్న రైతుసంఘం నాయకులు

2022 ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండలంలోని వడ్డుపల్లి రైతు భరోసా కేంద్రం ఎపిఒకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022 ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగు చేసిన వేరుశనగ, పత్తి, మిరప, కంది, తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కనీసం పెట్టుబడి రాని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో రైతులు అప్పుల్లో కూరుకుపోయారన్నారు. అంతేకాకుండా అప్పుల ఒత్తిళ్ల ఎక్కువై అనేకమంది రైతులు ఇప్పటికే ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం ఆత్మహత్య చేసుకున్న ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పంట నష్ట పరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఇకపోతే రైతుభరోసా కేంద్రాల్లో అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ఎం.రామయ్య, లక్ష్మన్న, ఓబుళపతి, జయరాం, దివాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం పోరుకేక' పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-పుట్లూరు



పోరుకేక పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

పోలవరం నిర్వాసితుల పోరుకేక.. సిపిఎం మహా పాదయాత్ర పోస్టర్లను మండల కేంద్రంలోని ఎంపి డిఒ కార్యాలయ ఆవరణలో మంగళ వారం విడుదల చేశారు. ఈ సందర్భం గా సిపిఎం నాయకులు మాట్లాడుతూ జూన్ 20 నుంచి జులై 4వ తేదీ వరకూ నెల్లిపాక నుంచి విజయవా డ వరకు 15 రోజులు దాదాపు 400 కిలోమీటర్లు వందలాది మందితో సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పరిహారం ఇవ్వాలని, 1986 నుంచి 2022 వరకు వరదల్లో మునిగిన గ్రామాలన్నింటికీ మొదటి దశ పునరావాసాలు కల్పించాలని, గోదావరి వరదల నుంచి రక్షించడానికి ప్రభుత్వాలు ముందస్తు సహాయ చర్యలు చేపట్టాలని, గతేడాది వరదల్లో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పిటి రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, కార్యదర్శి భాస్కర్, పూలరంగడు, వెంకటచౌదరి, శివుడు, బాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

బోనాల షహజీర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-అనంతపురం



షహజీర్‌ను అభినందిస్తున్న మెడికల్ కళాశాల సిబ్బంది

ప్రభుత్వ వైద్య కళాశాలలోని అనాటమీ విభాగంలో 16 సంవత్సరాలుగా ట్యూటర్‌గా పనిచేస్తున్న బోనాల షహజీర్ చెన్నయ్‌లోని సవీత యూనివర్సిటీ నుంచి అనాటమీ విభాగంలో పిహెచ్‌డి డాక్టరేట్ పొందారు. 'ఎవాల్యుయేషన్ ఆఫ్ యాంటీ డయాబెటిక్ యాక్టివిటీ ఆఫ్ ఎకంటిస్ ఎస్పిరా ఇన్ హై ఫ్యాట్ డైట్ అండ్ స్ట్రెప్టోజోసిన్ ఇన్యుస్ట్ డయాబెటిక్ రాట్స్' అనే అంశంపై సవీతా యూనివర్సిటీ అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ గుణప్రియ రమణాథ్ మార్గదర్శకత్వంలో పిహెచ్‌డి రీసెర్చ్ చేశారు. ఈమేరకు మంగళవారం జరిగిన పబ్లిక్ వైవాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎగ్జామినర్లు సహజీర్‌కు డాక్టరేట్‌ను అందించారు. డాక్టరేట్ పొందిన షహజీర్‌ను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ గంభీర రఘునందన్, వైస్ ప్రిన్సిపాళ్లు కెఎల్ సుబ్రమణ్యం, షారోన్ సోనియా, అనాటమీ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు, అనాటమీ అధ్యాపకులు భానుమతి, పున్యదీప్ కుమార్, భాను, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు అభినందనలు తెలిపారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-శింగనమల



వైద్యులను సన్మానిస్తున్న టిడిపి అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి

మండల పరిధిలోని గుమ్మేపల్లి గ్రామంలో సర్పంచి దేగల లలితమ్మ, టిడిపి అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కిమ్స్ సవీరా ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా దాదాపు 200 మందికి పైగా హాజరై వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 20 మందిని తదుపరి వైద్యం కోసం ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దేగల శ్రీనివాసులు, పెద్ద నాగముని, దండు విజయ్‌కుమార్, లక్ష్మయ్య, శివయ్య, ఓబుళపతి, పెద్ద ఓబయ్య, దేగల హరీష్, దేగల కిరణ్, కొయ్యగూర పెద్దన్న, మొండిపోగుల ఎర్రిస్వామి, డాల్ వీరనారాయణ, లోలూరు నారాయణస్వామి, వడ్డే రామాంజనేయులు, బండి ఎర్రిస్వామి, గంగాధర్, నారాయణస్వామి, ఆదిరెడ్డి, సూర్యనారాయణ, అమర్‌నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల



పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ఆనందరావుపేటలో 'కరెంట్ బిల్లులతో జనానికి షాక్' అనే కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కరెంటు బిల్లులను విపరీతంగా పెంచి పేదల నడ్డి విరుస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాలతో సిఎం జగన్ ప్రతినెలా కరెంటు, వంటగ్యాస్ ధరలను పెంచుతూనే ఉన్నాడన్నారు. కరెంటుకు బిల్లుతోపాటు ఫిక్స్ ఛార్జీలు, కస్టమర్, సర్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు ఛార్జీలు అంటూ పేదలను పీల్చిపిప్పి చేస్తున్నారన్నారు. రాజకీయ అవినీతిపరులు, కార్పొరేట్లు కుమ్మక్కై యూనిట్ విద్యుత్‌ను రూ.2, రూ.3కు కొనాల్సిన ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.10 నుంచి రూ.20 కొంటుండటం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా హిందుజా సంస్థకు రూ.1,200 కోట్లు అప్పన్నంగా చెల్లించడమే ఇందుకు నిదర్శమనానరు. దీనికితోడు రేపో, మాపో వ్యవసాయ పంపుసెట్లకు కూడా మీటర్లు బిగించి విద్యుత్ ఛార్జీల ఎసరు పెట్టేందుకు సిద్ధమయ్యారన్నారు. 200 యూనిట్లు లోపు వాడే వారందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామని మాట చెప్పి జగన్ మోసం చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకాన్ని నీరుగార్చారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శ్రీనివాసులు, మేకల పెద్దన్న, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, నాగరాజు, చెంగల్ ధనుంజయ, వెంకటనారాయణ, రాముడు, కుళ్లాయిస్వామి, గంపన్న, పెద్ద ఆంజనేయులు, అప్పా రాజు, దొడ్ల అయ్యప్ప, రామదాసు, రాముడు, కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

రైతుసంఘ జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున

ప్రజాశక్తి-డి.హీరేహాల్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

మండల వ్యాప్తంగా చిన్న, సన్నకారు రైతుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేస్తామని ఎపి రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున తెలిపారు మంగళవారం మండలంలోని జాతరకల్లు గ్రామంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం పట్ల సవతి ప్రేమ చూపుతోందన్నారు. ముఖ్యంగా రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ షరుతులకు తలొగ్గి వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసేందుకు పూనుకుందన్నారు. అలాగే రైతులకు సబ్సిడీతో అందించాల్సిన ఎరువులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సబ్సిడీ తగ్గిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఏంమాత్రం సబ్సిడీ తగ్గించలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

ఎంపిపిల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సునీత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపిపిల సంఘం జిల్లా గౌరవా ధ్యక్షులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్‌పర్సన్ ఎంపిపి సునీత సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించి బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహి ంచాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో అపరిశుభ్రతను గుర్తించి శానిటేషన్ పనులు చేపట్టేందుకు పంచాయతీరాజ్ అధికారులకు తెలియజేయాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధి సభ్యురాలు మన్నేరు కొండమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న వారిని గుర్తించి ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాంలో డాక్టర్ వద్ద పరీక్ష చేయించి మందులు అందజేయాలన్నారు. అనంతరం ఆసుపత్రిలో ఇన్వర్టర్ ఏర్పాటు చేయాలని, గ్రిల్ డోర్ ఏర్పాటు చేయాలని, ఫ్యాన్లు, లైట్లు రిపేరు చేయాలని, ల్యాబ్‌లో అవసరమైన పరికరాలు కొనుగోలు చేయాలని తీర్మాణాలు చేశారు. ఈ కార్యక్రమంలో పసులూరు సర్పంచి కల్పా రెడ్డి, వైద్యాధికారిణి డాక్టర్ స్వాతిలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఇఒఆర్‌డిఒ దామోదరమ్మ, సిహెచ్ఒ మోహన్‌రావు, పిహెచ్ఎన్ చెన్నమ్మ, సూపర్‌వైజర్లు బి.ఈశ్వరమ్మ, డి.ఈశ్వరమ్మ, ఫార్మాసిస్ట్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.



ఎపిఎస్‌పి బెటాలియన్స్ రేంజ్-3 డిఐజి సిహెచ్ వెంకటేశ్వర్లుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమాండెంట్ జగదీష్

14వ బెటాలియన్‌ను సందర్శించిన డిఐజి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

స్థానిక జంతలూరు 14వ బెటాలియన్‌ను ఎపిఎస్‌పి బెటాలియన్స్ రేంజ్-3 డిఐజి సిహెచ్ వెంకటేశ్వర్లు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కమాండెంట్ జగదీష్ పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు. అనంతరం పోలీసు క్యాంప్ మొత్తం కలియతిరిగారు. తర్వాత పోలీసు సిబ్బందితో దర్బార్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ డి.వి.రమణమూర్తి, ఆర్ఐలు నాగేంద్ర, లోకేశ్వరనాయుడు, సీతారామారావు, రాజశేఖర్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలి

డిఎంఅండ్‌హెచ్ఒ వీరబ్బాయి

ప్రజాశక్తి-బొమ్మనహాల్



ఆసుపత్రిని పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ వీరబ్బాయి

ప్రభుత్వాసుపత్రిలో వైద్యసిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని డిఎంఅండ్‌హెచ్ఒ వీరబ్బాయి సూచించారు. మంగళవారం మండలంలోని 24 గంటల ఆసుపత్రిని డిఎంఅండ్‌హెచ్ఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో ఇద్దరు డాక్టర్లు 24 గంటలు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే స్టాఫ్‌నర్స్ పోస్టులు రెండు ఖాళీ ఉన్నాయని, త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. వైద్యాధికారులు సమన్వయం చేసుకుని అన్ని రోగాలకు మందులను సమకూర్చాలన్నారు. అలాగే కాన్పులు ప్రభుత్వాసుపత్రిలోనే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇమినేషన్ జిల్లా ఆఫీసర్ యుగంధర్, బొమ్మనహాల్ మెడికల్ ఆఫీసర్లు శ్రీలక్ష్మి, మల్లేశ్వరి, ఫార్మాసిస్టులు ఓబుళనాయుడు, సూపర్‌వైజర్ యుగంధర్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీకాంత్, క్లర్క్ నీలకం నాయుడు, శ్రీధర్‌ఘట్ట క్లర్క్ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఈతకెళ్లి బాలుడు మృతి



చరణ్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, అక్క

కళ్యాణదుర్గం : పట్టణ సమీపంలో ఉన్న ప్రయివేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్‌లో ఈతకెళ్లి చరణ్ (12) మృతిచెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మధ్యాహ్నం నుంచి పాఠశాలలకు సెలవు కావడంతో తల్లి, అక్కతో కలిసి చరణ్ ఈతకు వెళ్లాడు. ఇందులో భాగంగా పూల్‌లో ఈత కొడుతూ నీటిలో మునిగాడు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో తల్లి, అక్క కేకలు వేశారు. అక్కడున్న వారు వెంటనే చరణ్‌ను బయటకు తీసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చరణ్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నూతన దంపతులకు గాయాలు

గార్లదిన్నె : మండల పరిధిలోని గుడ్డలపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన నూతన వధూవరులు హరి, ఇందూకు తీవ్రగాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మర్తాడు నుంచి పామిడికి ఈ మధ్యనే రిలీజ్ అయిన ప్రభాస్ ఆది పురుష సినిమాకి వెళ్తుండగా ఎదురుగా రాంగ్ రూట్లో వస్తున్న ఐచర్ వాహనం ఢీకొనడంతో నూతన వధూవరులకు ఇద్దరికీ కాళ్లు విరిగి తీవ్రగాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 ద్వారా ప్రభుత్వాసుత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్కా జూదరులు అరెస్టు

రాయదుర్గం : పట్టణ పొలిమేరలో కణేకల్ రోడ్డు మిట్ట వద్ద పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులో తీసుకున్నట్లు రాయదుర్గం పోలీస్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మన్న తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పక్కాగా అందిన సమాచారం మేరకు కణేకల్ రోడ్డులోని మిట్ట వద్ద నలుగురు వ్యక్తులు మట్కా రాస్తుండగా దాడి చేసి నిందితులను అరెస్టు చేయడంతోపాటు మట్కా చీటీలు, రూ.1,00,500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో ఒకరు రాయదుర్గం వాసికాగా మరో ముగ్గురు రాయదుర్గం మండలం టి.విరాపురం గ్రామానికి చెందినవారు అన్నారు. పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

జాతీయ రహదారిలో గుంతలు పూడ్చివేత



మట్టితో గుంతలను పూడుస్తున్న పోలీసులు

గుత్తి : మండలంలోని రజాపురం గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై పడ్డ గుంతలను పోలీసులు మంగళవారం పూడ్చివేశారు. రహదారిపై గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతుండడంతో సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్ఐలు శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జెసిబి ద్వారా ఎర్రమట్టి గుంతలను పూడ్చి వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు చర్యలు చేపట్టారు. రహదారికి సీఐ,ఎస్ఐలు మరమ్మతులు చేపట్టడం పట్ల పలువురు వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

నిర్మాణపనులు పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న నాయకులు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సిసి రహదారి, పెద్ద మురుగు కాలువ నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.మున్నారుబీ మంగళవారం పరిశీలించారు. కాలువ శిథిలావస్థకు చేరుకోవడంతో గోడలను తొలగించి చేపట్టిన మరమ్మతులను పర్యవేక్షించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి మురుగునీరు వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అంజలా, వైసీపీ నాయకులు షఫీ, వెంకట రాముడు, సునీల్, ప్రసాద్, సిబ్బంది మురళి తదితరులు పాల్గొన్నారు.

నార్పల విద్యార్థినికి రాష్ట్రస్థాయి పురస్కారం

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న మధుసూదన్ రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్నారు. మంగళవారం విజయవాడలో జరిగిన 'జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో సిఎం జగన్ విద్యార్థికి అవార్డు అందజేసి ప్రశంసించారు. ఈ సందర్భం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గురుకుల పాఠశాలకు రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు రావడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల సిబ్బంది కృషితోనే సాధ్యమైందన్నారు. భవిష్యత్‌లో కూడా మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు.


బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

పుట్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయులు నరసింహా, ఉపాధ్యాయులు డిడి.సాహెబ్, పురుషోత్తం, సురేష్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, పెద్ద నారాయణరెడ్డి, సర్పంచి రామిగాళ్ల ఓబులేసు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పికే ఎరువులు విక్రయించాలి

బొమ్మనహాల్ : మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పి ధరలకు ఎరువులు, పురుగుల మందులు విక్రయించాలని వ్యవసాయ శాఖఖెడి లక్ష్మీనాయక్ సూచించారు. మంగళవారం మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో ఎరువుల దుకాణాల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యత కలిగిన ఎరువులు, క్రిమిసంహార మందులనే విక్రయించాలాన్నరు. నకిలీ కంపెనీల ఎరువులు, రసాయన క్రిమిసంహార మందులు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ కౌలు రైతులకు త్వరలో కౌలుకార్డులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కౌలు రైతులు సంబంధిత విఆర్ఒలను ఆయా సచివాలయంలో కలిస్తే కార్డులు అందజేస్తారన్నారు. అలాగే పిఎం కిసాన్ కోసం రైతులు ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్.బి.కె సిబ్బంది, ఎరువుల క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

చిన్నారులు అంగన్‌వాడీలోనే ఉండాలి



మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బి.శ్రీదేవి

గుంతకల్లు : మూడు నుంచి ఆరు సంవత్సరాలోపు పిల్లలందరూ అంగన్‌వాడీ బడిలోనే ఉండాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బి.శ్రీదేవి సూచించారు. మంగళవారం స్థానిక బిటి పక్కీరప్ప కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో జన భాగీధారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపడం ద్వారా పాఠశాలలకు వెళ్లేందుకు సంసిద్ధులు అవుతారన్నారు. ఎందుకంటే అంగన్‌వాడీల్లో ఆటపాటల ద్వారా పిల్లలకు ప్రీస్కూల్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దీంతో పిల్లలు మానసికంగా, శారీరకంగా పెరుగుదల ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మేరీ, హెల్పర్ సత్య, లక్ష్మి, తల్లులు పాల్గొన్నారు.

ఎంహెచ్ అవార్డుల ప్రదానోత్సవ దృశ్యమాలిక



ఎంహెచ్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న అవార్డుల ఎన్నిక కమిటీ ఛైర్మన్ తెలకపల్లి రవి, ఎమ్మెల్యే దుద్దుకుంట, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గోపాల్‌గౌడను సన్మానిస్తున్న ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, మేనేజర్ వేణుగోపాల్, సిబ్బంది

ఎంహెచ్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరైన ప్రజాశక్తి సిబ్బంది, అభిమానులు

ప్రజాశక్తి ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జడ్పీ ఛైర్స్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అవార్డుల ఎన్నిక కమిటీ ఛైర్మన్ తెలకపల్లి రవి, ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, మేనేజర్ వేణుగోపాల్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉరవకొండ : విద్యార్థులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత సూచించారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడంతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ముఖ్యంగా పదో తరగతిలో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలుగా ఎంపిక చేసి ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బి.రాజేష్ మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులు భవిష్యత్తులో కూడా బాగా చదువుకుని పేరు ప్రఖ్యాతులు సంపాదించాలన్నారు. అనంతరం కురుగుంట నుంచి బదిలీపై వచ్చిన వచ్చిన ప్రిన్సిపాల్ భారతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్ గుర్రం రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ఉరవకొండ : ప్రతి రైతు తప్పకుండా భూసార పరీక్షలు చేయించుకోవాలని విడపనకల్ మండల వ్యవసాయాధికారి పెన్నయ్య సూచించారు. విడపనకల్ మండల పరిధిలోని వెల్పుమడుగు గ్రామంలో 487 సర్వే నంబర్ 2.87లో రైతు హనుమంతురెడ్డి పొలంలో భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రతి రైతు భరోసా కేంద్రంలో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయాలన్నారు. భూసార పరీక్షలు చేయడం వల్ల ఎలాంటి ఎరువులు వేయాలి, ఏ పంట వేయాలి అనే అంశాలపై స్పష్టత వస్తుందన్నారు. కావున ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ కుళ్లాయిస్వామి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రసూల్ ఖలందర్ ఉరుసు

గుత్తి : పట్టణంలోని నమాజ్ కట్ట సమీపంలో ఉన్న హజ్రత్ షా బాబా సయ్యద్ రసూల్ ఖలందర్ ఉరుసు మంగళవారం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా వివిధ రకాల పుష్పాలతో దర్గాను విశేషంగా అలంకరించారు. దర్గా నిర్వాహకుల ఆధ్వర్యంలో పట్టణంలోని పురవీధుల గుండా గంధం, జెండాలను ఊరేగించారు. ఈ సందర్భంగా కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొని దర్గాలో ప్రత్యేక చక్కెర చదివింపులు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దర్గా వద్ద అన్నదానం చేపట్టారు. ఈ ఉరుసులో దర్గా నిర్వాహకులు అల్లా బకాష్, బాషా, దాదా ఖలందర్, సాదిక్‌వలి మాట్లాడుతూ హజ్రత్ షా బాబా సయ్యద్ రసూల్ ఖలందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ఉరవకొండ : వజ్రకరూరు మండల కేంద్రంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, తనయుడు వై.భీమ్‌రెడ్డి ఆధ్వర్యంలో సుశీలా నేత్రాలయ సౌజన్యంతో మంగళవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్లు అవసరమైన వారిని సుశీల నేత్రాలయానికి సిఫారసు చేశారు. అలాగే మందులు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వజ్రకరూరు మండల వైస్ ప్రెసిడెంట్ సుశీలా రాణి, వజ్రకరూరు సర్పంచి మోనాలిసా, ఉపసర్పంచి మధుసూదన్‌రెడ్డి, ఉరవకొండ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ రమణయాదవ్, జరుట్ల రాంపురం సర్పంచి తిరుపాల్‌యాదవ్, వైసిపి సీనియర్ నాయకులు ప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఏసన్న, ఎర్రిస్వామి, పురుషోత్తం, గురు, తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో యోగా భాగం కావాలి

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని మేయర్ మహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా మంగళవారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నిరంతరం ఉరుకులు పరుగుల జీవితంలో శరీరం, మనస్సు రెండూ ఒత్తిడికి గురవుతున్నాయన్నారు. అలాంటి ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించే ఔషధంగా యోగా పని చేస్తోందన్నారు. ప్రపంచ దేశాలకు యోగాను మనదేశమే పరిచయం చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, కె.విజయభాస్కర్‌రెడ్డి, అదనపు ఎస్పీ హనుమంతప్ప, జిల్లా టూరిజం శాఖ అధికారి నాగేశ్వర్‌రెడ్డి, వైద్య విభాగం, ఆయుష్ శాఖ అధికారులు, వివేకానంద యోగా కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ప్రతి ఒక్కరూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండవచ్చని ఉరవకొండ ఆయుర్వేద సీనియర్ వైద్యాధికారి ఎస్ఎండి షఫీ, ఎంపిపి చంద్రమ్మ సూచించారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా మానసికంగా దృఢంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌస్, ఆయుర్, యోగా సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకట్, యోగా గురువులు ఓబులేసు, చంద్ర, వైద్యాధికారులు బాలాజీబాబు, కబీర్, మహేష్, ఫార్మాసిస్టు సుంకన్న, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నార్పల : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా శిక్షకురాలు వనితభూషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగా చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. అంతేగాకుండా మనలోని అనేక సృజనాత్మక విషయాలను యోగా వెలికి తీస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ రోజూ అరగంట సమయాన్ని కేటాయించుకుని యోగా చేయాలని సూచించారు.

అనంతపురం : ప్రపంచ జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ విభాగంగా, రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, వివేకానంద యోగా కేంద్రం మంగళవారం నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత కాలంలో యోగా ఆవశ్యకత, ఉపయోగాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుష్ సీనియర్ వైద్యాధికారులు డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, రామకుమార్, రఫీక్, లాల్యానాయక్, ప్రభావతి, రాధాకుమారి, ఆయుష్ సిబ్బంది, యోగా శిక్షకులు కృష్ణవేణి, గురురాజా, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు

యోగాతో మానసిక ప్రశాంతత

కిమ్స్ సవీరా ఫిజియోథెరపిస్ట్ డాక్టర్.శ్రీలత

ప్రజాశక్తి-అనంతపురం



యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని కిమ్స్ సవీరా ఆసుపత్రి ఫిజియోథెరపిస్టు డాక్టర్ శ్రీలత సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తితో మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల శరీరం అంతటా రక్త ప్రసరణ బాగా జరుగుతుందన్నారు. తద్వారా ప్రాణవాయువు కలిగిన రక్తం శరీరంలో అన్ని అవయవాలకూ చేరుతుందన్నారు. దీంతో రక్తపోటు, ఒత్తిడి తగ్గుతుందన్నారు. యోగా చేసే ముందు ఓ గ్లాసు నీళ్ల తాగడం చాలా మంచిదన్నారు. ముందుగా శ్వాస ప్రక్రియలు, ప్రాణాయామంతో శ్వాసపై ధ్యాస పెట్టాలన్నారు. మనసును దృఢంగా మార్చడంలో, ఒత్తిడిని నివారించడంలో, మోకాళ్ల నొప్పులను దూరం చేయడంలో, మెదడు పనితీరును మెరుగు పరచడంలో యోగా ఉపయోగపడుతుందన్నారు. అందుకే రోజుకు కనీసం ఇరవై నిమిషాలైనా యోగా చేయాలని సూచించారు.

కుష్టు వ్యాధి సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి-ఆత్మకూరు

కుష్టు వ్యాధి సర్వేపై మంగళవారం మండల కేంద్రంలోని ఆరోగ్య ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకూ ఇంటింటికీ వెళ్లి కుష్టువ్యాధి గ్రస్థులను గుర్తించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా స్పర్శ లేని మచ్చలు, ముఖం, చెవులు, ఎద, వీపు మీద నొప్పిలేని బుడిపెలు, కనురెప్పలు, కనుబొమలు రాలిపోవడం, కాళ్లు చేతులు తిమ్మిర్లు, వాపులు, ముక్కు దూలం అనిగిపోవుట, బొటనవేలు, చిటికెన వేలు, మణికట్టు పనిచేయక పోవడం, కాలి వేళ్ల నేలకు రాసుకోవడంచ పాదాలు, చేతులపై బొబ్బలు వంటి లక్షణాలు ఉంటే కుష్టువ్యాధి లక్షణాలుగా గుర్తించి వైద్యశాలలకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దయాకర్, సీహెచ్ఓ చంద్రావతి, ఎంపిహెచ్ ఇఒ నాగేశ్వరయ్య, పిహెచ్ ఎన్.తొలిసమ్మ, సూపర్‌వైజర్ వెంకటరత్నమ్మ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండలంలోని ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పించాలని వైద్యాధికారి డాక్టర్ షమీంతాజ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశావర్కర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లు ఇళ్లను చేసినప్పుడు కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని ఎలా గుర్తించాలి, ఏవిధంగా పరీక్ష చేయాలనే విషయాలపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హనీషా, సిహెచ్ఒ లోకనాథ్, పిహెచ్ఎన్ అరుణకుమారి, సూపర్‌వైజర్లు కృష్ణమోహన్, విశ్వనాథ్‌రావు, సూర్యకళ, ఇందిరమ్మ, ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆత్మకూరు సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

నూతన ఎంఇఒలకు సన్మానం

ప్రజాశక్తి-గుంతకల్లు

మండల ఎంఇఒ-2గా బాధ్యతలు స్వీకరించిన సుబ్బరాయుడును యుటిఎఫ్ నాయకులు మంగళవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ సుబ్బరాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. అదేవిధంగా గుంతకల్లు మండలంలో విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, అర్బన్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, రాజకుమార్, రూరల్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, కల్పన, నాయకులు శంకరయ్య, మల్లికార్జున, ఈరన్న, రవిప్రసాద్, మారుతీప్రసాద్, జయదుర్గ, లావణ్య, చిన్న రంగన్న, సిద్దయ్య, ప్రతాప్, రమేష్, యుటిఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గుంతకల్లులో ఎంఇఒ సుబ్బరాయుడును సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

రాయదుర్గం : మండల విద్యాశాఖ అధికారి-2గా వెంకటరమేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాయదుర్గం మండలంలోని వడ్రవన్నూరు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ పదోన్నతిపై ఎంఇఒ-2గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంఇఒ కార్యాలయ సిబ్బంది వెంకట రమేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ నాగమణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ : స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో మండల 2వ విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన పి.రమాదేవిని మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుని సమర్థవంతంగా విధులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప, ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సాకే భాస్కర్, మండల కార్యదర్శి బిసి ఓబన్న, జిల్లా కౌన్సిల్ సభ్యులు నాగేంద్ర, లోకేష్, గీతావాణి, సూర్యప్రకాష్, బాలకృష్ణ, వేణుగోపాల్, ఆదినారాయణ, వైబి.చౌదరి, పాండురంగ, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో ఎంఇఒ రమాదేవిని సన్మానిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు